# మారని ఉత్తరాలు




—భారతి

మహాలక్ష్మీ సమానురాలైన అమ్మకి
నమస్కారములు —

అక్కడే ఆగిపోయింది పెన్ను. అవును ప్రియమైన అమ్మకు అని ఎందుకు రాయను? ప్రతిమారు ఇదే ప్రశ్న!? అలాగే అమ్మ కూడా చిరంజీవి అని మొదలు పెట్టి రాస్తుంది. ప్రియమైన అని ఎప్పుడూ అనదు. ఛ! ఉత్తరం రాసి పదిహేను రోజులయింది. ఇలాంటి ప్రశ్నలతో ఇంకా ఆలస్యం చెయ్యకూడదని మళ్ళీ రాయటం మొదలుపెట్టాను.

నేను క్షేమం. హాయిగానే ఉన్నాను.

హాయిగా ఉన్నానా? మరి రాత్రి కలలసంగతేమిటి? ఎన్ని సార్లు చీకట్లో కన్నీళ్ళు తుడుచుకొన్నాను. ప్రతిమారు ఒకే మాదిరి కల. అమ్మ నన్ను దగ్గిరికి రమ్మనదు. నాతో నవ్వుతూ మాటాడదు. నన్ను దూరంగా ఉంచుతుంది. నేను "అమ్మా... అమ్మ" అంటూ పిలుస్తాను. పలకదు. నా గొంతు తడి ఆరిపోతుంది. మెలుకువ వస్తుంది. కళ్ళల్లోంచి కన్నీళ్ళు వెచ్చగా జారుతూ ఉంటాయి. అయినా ఇదంతా రాయలేనే! బహుశా ఆమెకీ ఇలానే ఉంటుంది కాబోలు. కాని ఆమె కూడా ఒక్క ముక్క అయినా రాయదే! ఎన్నాళ్ళ నుండో మనసులోని మాట మనసులోనే దాచుకోవడం అలవాటు ఆమెకి. ఆమె పెళ్ళివిషయంలో మొట్టమొదటిసారిగా ఆమె మనసులో మాట బయటకు రాలేదు. రాలేదు అనే కంటే రానివ్వలేదు మిగిలిన వాళ్ళు అంటే నిజం అవుతుంది. ఆ తరువాత నుండి ఆమె చెప్పలేదు. నిజమే! అప్పటి నుండి తనో గిరిగీసుకొని అందులో ఉండిపోయింది. ఎవర్నీ రానివ్వలేదు అందులోకి. ఆఖరికి నన్ను కూడా! అందువల్లనే నేను కూడా అందరిలాగా బయటివాణ్ణే.

పసికందు కళ్ళు, కాళ్ళు, చేతులు కదిలిస్తే తనతో మాట్లాడడానికి ప్రయత్నిస్తున్నాడని, దానికో అర్థం కల్పించుకొని ఆనందపడుతుంది ఆ పిల్ల తల్లి. అలా కల్పించుకోగానే సరికాదు. వెంటనే ఎవరికైనా చెప్పాలని ప్రయత్నిస్తుంది ఆనందంతో నిండిన ఆ మనసు. తల్లి, భర్త తప్పించి మిగిలిన వాళ్ళతో చెపితే మొట్టమొదట విన్నా ఆ తరువాత పట్టించుకోరు. భర్త దగ్గర లేకపోతే ఇంకాను, ప్రతీ చిన్న విషయం రాస్తుంది. ఎందుకంటే ఆ పసికందు కదలికలో ఆనందాన్ని పంచుకొనేందుకు అంతకంటే మించిన వ్యక్తి ఇంకోరుండరు ఆమెకి. కాని అది కూడా అమ్మ చెయ్యలేక పోయింది. ఆ విధంగా ఆ భావాల్ని కూడా ఆమె దాచుకోవలసి వచ్చింది. పసికందుగా ఉన్న నాకు చెప్పకొందో ఏమో, ఎవ్వరూ లేనప్పుడు?! ఎంత ప్రయత్నించినా గుర్తురావటం లేదు!

నాకు పదవ తరగతిలో ఫస్టుక్లాసు వచ్చిందన్న వార్తతో పరిగెట్టుకొంటూ ఇంటికి వెళ్ళాను. అమ్మ మడిలో ఉంది. అందుకని కొంచెం దూరంలో నిలబడి చెప్పాను.

"ఆహా" అన్నది కొద్దిగా పరుగులాంటి నడకతో దగ్గరకు వచ్చి. ఆ పరుగులాంటి నడకకు మాత్రమే ఆమె నిజమైన ఆనందం పరిమితం అయిపోయింది. కాని ఆనడక నాకు ఇంకా గుర్తు లేకపోతే అదికూడా తెలిసేది కాదు. ఆ తరువాత ఫస్టు క్లాసులు రావడం నాకు, ఆమెకు సాధారణ విషయం అయిపోయింది. నేను పై చదువులకి విదేశాలు వెళ్ళాలి అన్న ఆలోచన ఆమె మనసులో ఉంది అని నాకు తెలుసు. నిజంగా నేను వెళుతున్నానని చెప్పినా ఆమె ఆనందం కనపడ్లేదేమో కాని అదే రోజు నేనింకోవార్త కూడా చెప్పవలసి వచ్చింది. అది-ఆమెని పట్టించుకొని ఆమె భర్త ఈ లోకం విడిచి వెళ్ళిపోయాడని! మళ్ళీ మామూలే. ఆమె భావాలు ఆమెలోనే ఉండి పోయాయి. ఆమె బాధపడింది. ఎందుకు అన్న ప్రశ్నకు నాకు సమాధానం దొరకలేదు.

నేను పెరిగిన వాతావరణంలో నేను నాకే పరాయి వాణ్ణే అయిపోయాను. నిజమే. చాలా మంది "సహాయంతో" పెరిగాను. కాని ఆ సహాయం చేసిన మనిషి గుండెలో నా గురించి ఏమాత్రం "తడి" లేదు. వాళ్ళు నన్ను ఓ పరిధి అవతల ఉంచారు. పిల్లలు అందరూ పెరుగుతూ ఉన్నప్పుడు పొందే అన్నీ పొందలేకపోయినా, వాళ్ళు చేసే తప్పులు మాత్రం చేసాను. అన్నీ కలిపి నా చుట్టూ ఓ ప్రత్యేక వాతావరణం ఉంటూండేది. ఆ తరువాత నా పెళ్ళి విషయం నేనే నిశ్చయించు కొన్నాను. అప్పుడు అందరూ ఆశ్చర్యపడి పోయారుముందు. ఆ తరువాత కోపం తెచ్చుకొన్నారు. వెంటనే మనకెందుకులే అని ఊరుకొన్నారు. అప్పుడు అమ్మ బాధపడింది. ఎందుకంటే లోకం ఏం అంటుందో అని. అలా దూరంగా ఉంటూ వచ్చిన నేను ఆ దూరం ఎంతో నా పెళ్ళి తరవాత తెలుసుకొన్నాను. ఇంతయినా అవి ఏం మాట్లాడుకోం. ఇవి ఏవీ మమ్మల్ని బాధించ నట్లే ఉత్తరాలు రాసుకొంటాం. ఎవరి బాధ వాళ్ళు పడతాం. తల్లి, తండ్రి, పెద్దవాళ్ళు. అంతే కాని ప్రేమించుకోకూడదు. ఏమో! క్షేమ సమాచారాలు, వాతావరణ విషయాలు వంటి భోగట్టాలు రాసుకొంటాం. కాని ఆలోచనలు, ఆశలు, కలలు రాసుకోకూడదు. ఆపెయ్!

ఇలాంటి పరిస్థితిలో ఉన్నది మేం ఇద్దరమే కాదు. ఇంకా ఇలాంటి వాళ్ళు ఎందరో! అందుకే తరాలమధ్య అంత అతరం. తల్లి తండ్రులు, పిల్లలు వేర్వేరు జాతులు. కనీసం నా పిల్లలకి వాళ్ళ ఆశలు, కలలు, భావాలు పంచుకోడానికి మనుష్యుల్ని వెతుక్కోనే అవసరం రాకూడదు. వాళ్ళ తల్లి తండ్రులు పూజించదగ్గ వాళ్ళుగా కాదు, ప్రేమించ దగ్గ వాళ్ళుగా ఉండాలి!

ఇంక ఉత్తరం. మామూలే! న్యూస్ పేపర్లో చదివే విషయాలు, యూనివర్సిటీ పద్ధతులు, శలవల వివరాలు, ప్రయాణపు ఏర్పాట్లు మిగిలిన బంధువుల్ని అందర్నీ పేరుపేరున అడిగినట్లు — ఇత్యాదులు. చివర్న ఇంతే సంగతులు.

తప్పులున్న క్షమించవలెను.

ఇట్లు

నీ కుమారుడు